జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా అందోల్ నియోజకవర్గం సుల్తాన్‌పూర్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు గడిచినా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. ప్రజలు బీఆర్ఎస్, కేసీఆర్‌ను విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.
- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 16


కోహీర్ నుంచి బహిరంగ సభకు వెళ్లేందుకు ఏర్పాట్లను సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, దేవీప్రసాద్

పటాన్‌చెరు: పటాన్‌చెరు నుంచి బయలు దేరుతున్న బీఆర్ఎస్ నాయకులతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

ప్రజలకు అండా.. గులాబీ జెండా

సీఎం కేసీఆర్ సభకు భారీగా తరలిన బీఆర్ఎస్ శ్రేణులు.. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు ఖాయమని నినాదాలు

రామచంద్రాపురం: ప్రజా ఆశీర్వాద సభకు వెళ్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్, నాయకులు

న్యాల్‌కల్: హద్నూర్ నుంచి తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

జిన్నారం: మాదారంలో కేసీఆర్ సభకు వెళ్తూ నినాదాలు చేస్తున్న నాయకులు

సింగితం నుంచి కేసీఆర్ సభకు తరలిన నేతలు

న్యాల్‌కల్: కేసీఆర్ సభకు భారీగా తరలివెళ్తున్న మండల బీఆర్ఎస్ శ్రేణులు

కంది: సభకు తరలివెళ్లిన కంది మండల బీఆర్ఎస్ నాయకులు

బొల్లారం: కేసీఆర్ సభకు తరలివెళ్తున్న ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు

నారాయణఖేడ్: చాప్టా(కె) నుంచి బస్సులో..

రామచంద్రాపురం: సుల్తాన్‌పూర్ సభకు వెళ్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి, తదితరులు

మెరుగైన వైద్య సేవలు అందించాలి

జిల్లా వైద్యాధికారి గాయత్రిదేవి

కోహీర్, ఏప్రిల్16 : ప్రభుత్వ దవాఖానల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రీదేవి అధికారులను ఆదేశించారు. మంగళవారం దిగ్వాల్, బిలాల్‌పూర్ గ్రామాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ప్రతి మంగళవారం బిలాల్‌పూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేకంగా మహిళల ఆరోగ్యం కోసం అన్ని రకాల పరీక్షలను నిర్వహిస్తున్నామని చెప్పారు. అవకాశాన్ని మహిళలందరూ వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవీన్‌కుమార్, ఎంపీహెచ్ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

దిగ్వాల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికా డాక్టర్ గాయత్రిదేవి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల తనిఖీ

న్యాల్‌కల్, ఏప్రిల్ 16 : ఆరోగ్య కేంద్రాలకు వైద్య కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని, ప్రసవాలు, కుటుంబ నియంత్రణ అపరేషన్ల సంఖ్యను పెంచేలా వైద్యాధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇమ్యూజైనెన్ కో-ఆర్డినేటర్, సూపరింటెండెంట్ డాక్టర్ సంగారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మిర్జాపూర్(బి) గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రస్తుత వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు ఇంటింటికీ వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో వైద్యాధికారి నృపేన్‌చక్రవర్తి, వైద్య సిబ్బంది శ్యామల, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సంగారెడ్డి

కాంగ్రెస్‌లో చేరికలు

కోహీర్, ఏప్రిల్ 16 : రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్ మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్, మాజీ మంత్రి చంద్రశేఖర్, గిరిధర్‌రెడ్డి, మంకాల్ సుభాశ్, ఇజ్రాయెల్ బాబీ, సందీప్, మొగులయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

న్యాల్‌కల్, ఏప్రిల్ 16: మండలంలోని ముంగి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మైనార్టీ సెల్ నాయకుడు సయ్యద్ షకీల్ అహ్మద్ కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం హైదరాబాద్‌లో సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చంద్రశేఖర్, ఎంపీ అభ్యర్థి సురేశ్ కుమార్ షెట్కార్, మాజీ టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్ హైమద్, మండల నాయకులు గౌసొద్దీన్, రఫీయొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

సింగితం నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

రాయికోడ్, ఏప్రిల్ 16 : సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి సురేశ్ కుమార్ సమక్షంలో రాయికోడ్ మండల పరిధిలోని సింగితం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ నాయకుడు మహ్మద్‌సుల్తాన్ చేరారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ఎండీ మోహిన్ పార్టీ కండువా కప్పుకున్నారు.

తారాలో మెగా రక్తదాన శిబిరం


మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 16 : రక్తదానం మహాదానమని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ అన్నారు. ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆదేశాల మేరకు మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ 6 విభాగాలు, అర్థశాస్త్ర విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదానంతో ఇతరుల ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు ప్రవీణ, డాక్టర్ వెంకటేశం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగదీశ్, డాక్టర్ పద్మజ, డాక్టర్ సిద్ధులు, డాక్టర్ అభిజిత్, వైద్య అధికారి డాక్టర్ వెంకట్, సూపర్‌వైజర్ రాజు, కౌన్సిలర్ విజయ్, టెక్నీషియన్ మోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మంత్రి దామోదరకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కౌన్సిలర్ చంద్రారెడ్డి

మంత్రిని కలిసిన కౌన్సిలర్

బొల్లారం, ఏప్రిల్ 16 : లోక్‌సభ ఎన్నికల ప్రచారసభ సందర్భంగా రామచంద్రపురానికి వచ్చిన మంత్రి దామోదర రాజనర్సింహను రాష్ట్ర నాయకులు మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్, నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్ కుమార్ రెడ్డి, నాయకులు జైపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

మట్టి మోస్తూ ప్రచారం చేస్తున్న బీజేపీ నేత

జిన్నారం, ఏప్రిల్ 16: మండలంలోని సోలక్‌పల్లిలో బీజేపీ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోలక్‌పల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు మట్టి తట్టలు మోసి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో వినోద్‌రెడ్డి, సీహెచ్ వెంకటేశ్, కె.సాయి పాల్గొన్నారు.

శ్రీరామనవమికి ఆలయాలు సిద్ధం

సీతారాముల కల్యాణానికి ముస్తాబైన ఆలయాలు

జిన్నారం, ఏప్రిల్ 16 : జిన్నారం మండల వ్యాప్తంగా బుధవారం జరిగే శ్రీరామ నవమి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. జిన్నారం, మంగంపేట, మాదారం గ్రామాల్లోని రామాలయాలతో పాటు శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహించే ఖాజీపల్లి, గడ్డపోతారం, వావిలాల, ఊట్ల, శివనగర్, అండూరు, సోలక్‌పల్లి, దాదిగూడెం తదితర గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. శ్రీరామ నవమి సందర్భంగా రామాలయాలు విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్నాయి.

కోహీర్‌లో..

కోహీర్, ఏప్రిల్16 : కోహీర్ పట్టణంలోని రామ మందిరంతో పాటు దిగ్వాల్ గ్రామంలోని సీతారామాంజనేయ ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు మంగళవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం సీతారాముడి కల్యాణం ఉంటుందని, అనంతరం భక్తులకు అన్నదానం చేస్తామని కల్యాణ్‌కృష్ణ రాందాస్ మహారాజ్, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి..

బొల్లారం, ఏప్రిల్ 16: మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీ నగర్ శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

గుమ్మడిదలలో ..

గుమ్మడిదల, ఏప్రిల్ 16 : శ్రీరామ నవమిని పర్వదినం పురస్కరించుకొని మండల కేంద్రంలో శ్రీకల్యాణ రామచంద్రస్వామి ఆలయం ముస్తాబైంది. ఆలయ వంశపార్యపర్యంకులు కేవీ. రామానుజాచార్యులు, కేవీ. నర్సింహాచార్యులు ఆలయ కమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి పర్యవేక్షణలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అర్చక బృందం కల్యాణోత్సవాన్ని నిరాడంబరంగా నిర్వహించనున్నారు. 17 నుంచి 20 తేదీ వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు.

జిన్నారం: విద్యుత్ దీపాలంకరణలో మాదారంలోని రామాలయం

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

అల్లాదుర్గం, ఏప్రిల్ 16 : అక్రమంగా నాలుగు వాహనాల్లో రైస్‌మిల్లుకు తరలిస్తున్న 54 టన్నుల రేషన్ బియ్యం బస్తాలను పట్టుకున్నట్లు ఎస్పీ బాలస్వామి తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మండలంలోని గడిపెద్దాపూర్‌లోని ఓ రైస్‌మిల్‌కు నాలుగు వాహనాల్లో 54 టన్నుల రేషన్‌బియ్యం తరలిస్తున్నారని, రైస్‌మిల్ సమీపంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ చేసి బియ్యంతో పాటు వాహనాలను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన బియ్యం విలువ రూ,10.80లక్షలు ఉంటుందన్నారు. డీఎస్‌వో అధికారులకు సమాచారం అందించగా డిప్యూటీ తహసీల్దార్ ప్రణితరెడ్డి పంచనామా నిర్వహించారు. ఈ మేరకు నలుగురు వాహన డ్రైవర్లు, రైస్‌మిల్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో మెదక్ డీఎస్పీ రాజేశ్,అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, టాస్క్ ఫోర్స్ సీఐ తిరుమలేశ్, ఎస్సై ప్రవీణ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి

హత్యలు చేస్తున్న నిందితుడికి జీవితఖైదు

పటాన్‌చెరు, ఏప్రిల్ 16 : ఆస్తికోసం, నగల కోసం వరుసగా 10 హత్యలు చేసిన నిందితుడికి కోర్టు జీవితఖైదు విధించింది. సంగారెడ్డి ఎస్పీ కార్యాలయం నిందితుడి వివరాలను మంగళవారం వెల్లడించింది. సంగారెడ్డి జిల్లా ఆరుట్లకు చెందిన మాయని రాములు / మన్నె సాయిలు (42) డ్రైవర్. నిందితుడు మాయని రాము లు 2019 జూలై 11న మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం నాంచర్ల గ్రామానికి చెందిన అంజలమ్మను చేవేళ్ల బస్టాండ్ వద్ద మాయ మాటలు చెప్పి తన వాహనంపై ఎక్కించుకుని పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామానికి తీసుకుని వచ్చాడు. లింగసానికుంట వద్ద గొంతు నులిమి చంపి ఆమె వద్ద ఉన్న రూ. 120, సెల్‌ఫోన్‌ను దొంగిలించాడు. మాయని రాములుకు గతంలోనూ పలు నేరాలకు పాల్పడిన చరిత్ర ఉన్నది. 2003లో ఒక మహిళను తుప్రాన్ ప్రాంతంలో గొంతు నులిమి చంపి ఆమె వద్ద వెండి ఆభరణాలు దొంగిలించాడు. 2016లో ఆరుట్లలో ఒక మహిళ గొంతు నులిమి చంపాడు. 2008లో బాచుపల్లి పరిధిలో మరో మహిళలను కొట్టి చంపాడు. 2008లో నర్సాపూర్ ప్రాంతంలో ఒక మహిళను చీరతో మెడకు ముడి వేసి చంపి వెండి ఆభరణాలు దొంగతనం చేశాడు. 2009లోనే నార్సింగ్ ఏరియాలో మచునూర్ జింకల పార్కు వద్ద ఒక మహిళను హత్య చేసి వెండి ఆభరణాలు దొంగిలించాడు. కూకట్‌పల్లి జన్మభూమి కాలనీలో ఒక మహిళను చంపి చెవుల కమ్మలు, గోల్డ్ చైన్ దొంగలించాడు. 2019లో సెప్టెంబర్‌లో కూకట్‌పల్లి జన్మభూమి కాలనీలో ఒక మహిళను హత్య చేసి వెండి ఆభరణాలు చెవుల కమ్మలు, గొల్డ్ చైన్, ఒక నెక్లెస్, ఒక ఫోన్ దొంగలించాడు. ఆల్విన్ కాలనీ మహంకాళి టెంపుల్లో అమ్మవారి మెడలో నుంచి 10 గ్రాముల గోల్డ్ చైన్ దొంగతనం చేసినట్లు పోలీసులు రుజువు చేశారు. పలు పోలీస్‌స్టేషన్లలో కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని వివరించారు. అప్పటి పటాన్‌చెరు ఎస్‌హెచ్‌వో నరేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన అనంతరం నిందితుడి నేరాన్ని కోర్టులో సాక్ష్యాదారాలతో రుజువు చేశారు. కేసులో 2వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు మెజిస్ట్రేట్ సంగారెడ్డి డా పీపీ. కృష్ణాఅర్జున్ నిందితుడికి జీవిత ఖైదు, రూ. 3వేల జరిమానా విధించారు. దర్యాప్తు అధికారి నరేశ్, ప్రస్తుత ఎస్‌హెచ్‌వో ఇన్‌స్పెక్టర్ ప్రవీన్‌రెడ్డి, పీపీ విజయ్‌శంకర్‌రెడ్డి, సిబ్బందిని ఎస్పీ రూపేశ్ అభినందించారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

మునిపల్లి, ఏప్రిల్ 15: డ్రైనేజీలు శుభ్రం చేయించి అనారోగ్యం బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని మండలంలోని మొగ్దుంపల్లి ప్రజలు కోరుతున్నారు. మండల పరిధిలోని మొగ్దుంపల్లిలోని పలు వార్డుల్లో డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండిపోవడంతో దుర్వాసన వస్తున్నాయని వాపోతున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తయినప్పటి నుంచి నేటి వరకు డ్రైనేజీలు శుభ్రం చేసింది లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను గుర్తించి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

మనూరు, ఏప్రిల్ 16 : రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి కేటాయించిన నిధులతో పనులు వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీవో అలివేలు మంగ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ సమావేశ మందిరంలో పలు గ్రామాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వీవో అధ్యక్షురాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో అన్ని పాఠశాలలు ఆదర్శ పాఠశాలలుగా మార్చేందుకు కేటాయించిన నిధులతో అభివృద్ధి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వంశీకృష్ణ, మండల సమైఖ్య అధ్యక్షురాలు మీన, సీసీ నాగమణి, అకౌంటెంట్ సంజీవులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

సిద్దిపేట, ఏప్రిల్ 16 : కుష్టు వ్యాధి నిర్మూలనకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆదేశాల మేరకు వివిధ కార్యక్రమాలు చేపట్టామని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి తెలిపారు. జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆమె అధ్యక్షతన కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న నోడల్ పర్సన్స్‌కి, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఓరియంటేషన్, నిక్యూస్ట్ యాప్‌పై ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. వ్యాధిగ్రస్తులను గుర్తించిన వెంటనే కొత్తగా రూపొందించిన ఎన్ఐకే యూఎస్‌టీహెచ్ యాప్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. ప్రణాళికతో కుష్టు నిర్మూలనలో భాగంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టవచ్చన్నారు. కార్యక్రమంలో శిక్షకులు, రాష్ట్ర లెప్రసీ సొసైటీ సభ్యులు కామేశ్వరరావు, నరసింహస్వామి, డీపీఎంవోలు, ఎస్ఎల్ఈపీ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారి శ్రీదేవి

ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 16: వచ్చే నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ హరిచందనదాస్ ఆయా జిల్లాల్లో ఎన్నికల అధికారులకు సూచించారు. మంగళవారం ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉండేలా, పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ప్రకారం ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత స్ట్రాంగ్ రూమ్‌కు పోలైన బ్యాలెట్ బాక్సులు అత్యంత పకడ్బందీగా రూట్ మ్యాప్ సిద్ధం చేసుకో వాలన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో సిద్దిపేట నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.మనుచౌదరి, జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సొంతింటికే నిప్పు

నారాయణరావుపేట, ఏప్రిల్ 16: కుటుంబ తగాదాలతో సొంత ఇంటికే నిప్పు పెట్టిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ..గ్రామానికి చెందిన పొన్నమేని నర్సింహులు కుటుంబ తగాదాల కారణంగా సోమవారం రాత్రి పెట్రోల్ తీసుకువచ్చి తన ఇంటిపైన పోసి నిప్పంటించాడు. దీంతో ఇంట్లో ఇన్న సిలిండర్, ఫ్రిజ్, విలువైన వస్తువులు కాలిపోయినట్లు ఎస్సై తెలిపారు. సుమారు వాటి విలువ రూ.5 లక్షల వరకు ఉంటుందని తెలిపారు.

మహిళ ఆత్మహత్య

గుమ్మడిదల, ఏప్రిల్ 16 : అనారోగ్యంతో బాధపడుతున్న యువతి మనస్తాపానికి గురై ఆత్యహత్య చేసుకున్న సంఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నారం ఇందిరమ్మ కాలనీలో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రవీంద్రశర్మ కుటుంబ సభ్యులతో బతుకుదెరువు కోసం మండలంలోని అన్నారం గ్రామానికి వచ్చి ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్నారు. ఈయనకు నలుగురు సంతానం. పెద్ద కూతురు కుషుబు(21)కు వివాహమైంది. కొన్ని రోజుల క్రితం నుంచి ఫిట్స్‌తో బాధపడుతున్నది. రవీంద్రశర్మ చిన్న కూతురు చదువు కోసం స్వరాష్ట్రానికి వెళ్లడంతో ఇంటి వద్దే కొడుకు సంతోశ్, పెద్దకూతురు కుషుబు ఉన్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నితో ఉరి వేసుకుని ఆత్యహత్య చేసుకుంది. ఈ విషయం కుమారుడు ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. దీంతో వెంటనే జార్ఖండ్‌ను నుంచి వచ్చే వరకు మృతి చెందిన కూతురు మృతదేహాన్ని నర్సాపూర్ సర్కారు దవాఖానలో భద్రపరిచారు. కూతురు అనారోగ్యం వల్లే మనస్తాపానికి గురై మృతి చెందిందని తండ్రి ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు.